క్లుప్తంగా

నేడు కంటి వ్యాధులపై అవగాహన సదస్సు

నెల్లూరు(అర్బన్): ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులకు కంటి వ్యాధులు–నివారణపై ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్మార్ట్ విజన్ ఐ ఆస్పత్రి, లేజర్ సెంటర్ సహకారంతో విజయమహల్‌గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సుకు ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ బీరం రాజేంద్రరెడ్డి హాజరై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీజేపీ నేతల వినతి



నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని టిప్పు సుల్తాన్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. 17వ శతాబ్దంలో హిందువులపై దాడులకు పాల్పడిన టిప్పు సుల్తాన్ విగ్రహాల ఏర్పాటు, ఉత్సవాలకు బీజేపీ వ్యతిరేకమని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు మిడతల రమేష్, దాసరి రాజేంద్రప్రసాద్, చిట్టిబాబు, సుధాకర్, రత్నంనాయుడు, దాంగేనాయుడు, ఇరిగేంద్రబాబు, ఆదినారాయణ, రవి, కృష్ణ, నాగేంద్రసింగ్, ప్రభాకర యాదవ్, నారాయణయాదవ్, జయచంద్ర, లక్ష్మణరావు, సుజన పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సన్మానం



కొడవలూరు: కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ హేమలత ఆదివారం ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా వారిని సహచర ఉపాధ్యాయులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ వసంతకుమారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హెచ్‌ఎంగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులుగా చంద్రశేఖరరెడ్డి, హేమలత అందించిన సేవలను కొనియాడారు. ఎంఈఓ–2 ఎస్.అంకయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేశారన్నారు. వృత్తి పట్ల అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందడం బాధ కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎంలు మోహనరామలింగయ్య, శ్రీనివాసరావు, డీ ఓబులేసు, సీఆర్‌ఎంటీలు ఎం దయాకర్, పెంచలరావు, వీరాంజనేయులు, శ్రీహరి, రమేష్, లీలయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అటవీ స్థలం పరిశీలన



సీతారామపురం : సీతారామపురం – పోరుమామిళ్ల ఘాట్ రోడ్డు మార్గంలోని అటవీ ప్రాంతంలో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఓ మొబైల్ నెట్‌వర్క్ కేబుల్ ఏర్పాటు కోసం శనివారం ఉదయగిరి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి స్థల పరిశీలన చేశారు. ప్రస్తుతం ఘాట్ రోడ్డు మార్గంలో 167/బీ జాతీయ రహదారి పనులు జరుగుతున్న నేపథ్యంలో గతంలో చేసిన సర్వే అంతా తారుమారు అయిందని తెలిపారు. అటవీ ప్రాంతంలో మళ్లీ సర్వే చేసేందుకు పరిశీలించినట్లు తెలిపారు. ఆయన వెంట డీఆర్‌ఓ ప్రసాద్, ఎఫ్‌బీఓ ఖాజా, మొబైల్ నెట్‌వర్క్ సంస్థ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ



విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని పురస్కరించుకుని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న సుంకు చెంగన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో సీజనల్ వ్యాధులపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. అందువల్ల ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నుంచి రక్షణకు కిటికీలకు మెష్‌లు, దోమతెరలు వినియోగించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అరవింద కుమార్, ఆరోగ్యకార్యదర్శి రమణమ్మ, సూపర్‌వైజర్ శ్రీధర్, మలేరియా నివారణ పట్టణ హెల్త్ అసిస్టెంట్ నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి



ప్రైవేట్ కళాశాలలో ట్యాంకును పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ

నెల్లూరు(బారకాసు): సీజనల్ వ్యాధుల నియంత్రణ చర్యల్లో భాగంగా కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని విద్యాసంస్థల్లో కార్పొరేషన్ సూచించిన పారిశుధ్య ప్రమాణాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షిస్తున్నామని కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ అన్నారు. నగరంలోని ఆచారివీధి, బారకాసు సమీపంలోని ప్రైవేట్ కళాశాలల ప్రాంగణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్, ఎన్‌ఓసీ సర్టిఫికెట్లు, తరగతి గదులు, మంచినీటి సదుపాయం, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణను పరిశీలించి మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మరుగునీటి వసతిపై కళాశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వాటర్ ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆర్వో వాటర్ ప్లాంట్‌ల నిర్వహణపైన నిర్వాహకులకు సూచనలు చేశారు. పరిశుభ్రమైన ప్రదేశాల్లో వంట చేయాలని, వంట శాలల్లో ఆహారాన్ని పరిశుభ్రంగా ఉంచేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వంటగదితో పాటు డైనింగ్ గదిలో తగినంత గాలి, వెలుతురు ప్రసరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణకు నగర పాలక సంస్థ సూచించిన ప్రమాణాలను వ్యాపార, వాణిజ్య కేంద్రాల్లో తప్పనిసరిగా పాటించాలని, ఎవరైనా ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ప్రైవేట్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి



ఆర్‌ఐఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, మెండా శ్రీహర్ష డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌ఐఓ శ్రీనివాసులును ఆయన కార్యాలయంలో శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ కళాశాలలు అధిక ఫీజులతో విద్యార్థులను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో భవన అనుమతి, ఫైర్ సర్టిఫికెట్, మైదానం, పార్కింగ్ సౌకర్యాలు లేకుండానే నారాయణ, శ్రీచైతన్య కళాశాలలను నడుపుతున్నారని తెలిపారు. నగరంలోని డీమార్ట్ వద్ద ఓవెల్ కళాశాల నూతన భవనాన్ని నిర్మించి తరగతులు ప్రారంభించిందన్నారు. ఆ భవనం చుట్టూ ఎటువంటి ఖాళీ ప్రదేశం లేదన్నారు. కళాశాలలో, చుట్టుపక్కల ప్రాంతంలో అగ్నిప్రమాదం సంభవిస్తే విద్యార్థులు బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని లేకుంటే, ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

నేడు ఆరోగ్యంపై అవగాహన సదస్సు

నెల్లూరు(బారకాసు): అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఫ్యామిలీ ఫిజీషియన్ పేరుతో ఆరోగ్యంపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జీ దయాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేదాయపాళెంలోని తన స్వగృహంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యపరమైన సూచనలు, సలహాలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సూక్ష్మ కళాకారుడికి పురస్కారం

ముత్తుకూరు: సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్‌లో తెలుగు పండిట్, సూక్ష్మకళాకారుడు సోమా పద్మారత్నంకు రాష్ట్రీయ ప్రతిభ పురస్కారం లభించింది. సేవ్ నేచర్–సేవ్ గరల్స్– చైల్డ్స్ ప్రాజెక్టులో తన కృషికి ఫలితంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోకు చెందిన 'వర్తి వెల్నెస్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు పద్మారత్నం శనివారం తెలిపారు.

నిస్వార్థ సేవలతోనే నిజమైన గుర్తింపు



సభావేదికపై మేయర్, అధికారులతో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులు

నెల్లూరు(బారకాసు): విధి నిర్వహణలో నీతి, నిజాయతీ, నిబద్ధతతో సేవలందించినప్పుడే నిజమైన గుర్తింపు లభిస్తుందని నగర మేయర్ పోట్లూరి స్రవంతి అన్నారు. కార్పొరేషన్‌లోని పలు విభాగాల్లో నాల్గో తరగతి ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురు ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆఫ్ మున్సిపల్ కార్పొరేషన్, ఇంజినీరింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం ఉద్యోగ విరమణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేయర్ పాల్గొని మాట్లాడారు. కార్పొరేషన్‌లో 40 ఏళ్ల పాటు విశిష్ట సేవలందించి, ఉన్నతాధికారుల మన్ననలు పొంది ఉద్యోగ విరమణ చేస్తున్న ఏడుగురు సిబ్బంది సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం వర్క్‌ఇన్‌స్పెక్టర్ మోసెస్, ఫిట్టర్ శ్రీనివాసరావు, అటెండర్ ఎన్ ఏసోబు, వాచ్‌మెన్ ఎస్‌కే దస్తగిరిబాషా, క్లీనర్ బాలయ్య, ఆయిలర్ ఎం వెంకటస్వామి, టైమ్‌స్కేల్ ఉద్యోగి కమలమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఈ సంపత్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఈఈ సంజయ్, అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి శీనయ్య, చక్రపాణి, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్ష అధికారులు

నెల్లూరు (టౌన్): బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలని సమగ్రశిక్ష జిల్లా ప్రత్యామ్నాయ పాఠశాల కోఆర్డినేటర్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. నేడు బడికి పోతా కార్యక్రమంలో భాగంగా స్థానిక మహాత్మ గాంధీనగర్‌లో సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలను ఎక్కడైనా పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులపైన ఉందన్నారు. బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. బాలల విద్య కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చర్యలు చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఉపాధ్యాయులు ఖాజామొహిద్దీన్, ఐటీడీఏ ఎంఓ శాంతికుమారి, సీఆర్పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపైనే పార్కింగ్



ఇరుకైన రహదారులు..నిబంధనలు పాటించని వాహనచోదకులు..ఆపై రోడ్లపైకి చొచ్చుకొచ్చిన ఆక్రమణలు వెరసి నెల్లూరు నగర వాసులకు ట్రాఫిక్ నిత్యం నరకం చూపిస్తోంది. నగరంలోని మద్రాసుబస్టాండ్ వద్ద పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. మద్రాసు బస్టాండ్ చుట్టుపక్కల హోటళ్లు, షాపింగ్‌మాల్స్, కూరగాయల మార్కెట్ ఉన్నాయి. వాటికి పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో అక్కడకు వచ్చేవారు గంటలకొద్దీ నడిరోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఫలితంగా నగరవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు మొక్కుబడి విధులకే పరిమితమవుతున్నారు.

–నెల్లూరు(క్రైమ్)



అబ్దుల్ సలాం సేవలు మరువలేనివి



అబ్దుల్ సలాం దంపతులకు సత్కారం

నెల్లూరు(అర్బన్): జిల్లా వైద్యఆరోగ్య శాఖలోని డెమో విభాగంలో ప్రొజెక్షనిస్టుగా ఎస్కే అబ్దుల్ సలాం అందించిన సేవలు మరువలేనివని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య కొనియాడారు. సంతపేటలోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో అబ్దుల్ సలాం ఉద్యోగ విరమణ సభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 38 ఏళ్ల పాటు అబ్దుల్ సలాం ఎంతో చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించారన్నారు. అలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు పనిచేయాలన్నారు. అనంతరం అబ్దుల్‌సలాం దంపతులను శాలువాలతో సత్కరించారు. డెమో అధికారి శ్రీనివాసరావు, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



డయేరియాపై స్పెషల్‌డ్రైవ్



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పొదలకూరు: డయేరియాపై జూలై 1 నుంచి నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహ్మద్‌రఫీ తెలిపారు. పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తొలుత శాఖల వారీగా జరిగిన అభివృద్ధి, సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో డయేరియా ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పరిశుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారం సంపూర్ణ అవతారం



చీమకుర్తి వెంకటేశ్వరరావుకు సత్కారం

నెల్లూరు(బృందావనం): భగవంతుని శ్రీరామ, శ్రీకృష్ణావతారాలు సంపూర్ణ అవతారాలని విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. పద్యసారస్వత పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో జరుగుతున్న శ్రీకృష్ణకథామృతం భాగవత సప్తాహంలో భాగంగా నాల్గోరోజు శనివారం 'శ్రీకృష్ణతత్త్వం'పై ఉపన్యసించారు. శ్రీకృష్ణుడు లీలామానుష విగ్రహుడని, భగవత్తత్వాన్ని ప్రదర్శించినా అంతర్గతంగా మానవతాదృక్పథం ఉందన్నారు. పూతనను హతమార్చినా ఆమె కల్మషాన్ని హరించి మోక్షాన్ని ప్రసాదించాడన్నారు. శిశుపాలుణ్ణి వధించినా అతని తేజస్సును తనలో లీనం చేసుకున్నాడన్నారు. తాను ధనవంతుడైనా దరిద్రుడైన కుచేలుడ్ని సత్కరించాడన్నారు. అనంతరం చీమకుర్తిని ఘనంగా సత్కరించారు. సభాపోషకులుగా ఎం చంద్రశేఖర్‌రావు వ్యవహరించగా, పోలవరపు లక్ష్మీనరసింహారావు అధ్యక్షత వహించారు. కోట రాజశేఖర్ సభాకార్యక్రమాన్ని నిర్వహించారు.సూరం చంద్రశేఖర్, శతావధాని సూరం శ్రీనివాసులు, చక్కిరాల జయప్రసాద్, అన్నవరం సత్యనారాయణ, కోట శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నారాయణలో ఉచిత దంత వైద్యశిబిరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దంత వైద్యులు

నెల్లూరు(అర్బన్): వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుని నారాయణ దంత వైద్యశాలలో జూలై 1 నుంచి నెల రోజుల పాటు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నారాయణ దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ జయ్ రెజినాల్డ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను నగరంలోని నారాయణ దంత వైద్యశాలలో శనివారం ఆవిష్కరించారు. ఎత్తు పళ్లు, వంకర పళ్లు, ఎత్తైన దవడలు, చిగుళ్లు, సిరామిక్ బ్రేస్, సెల్ఫ్‌లైగేటింగ్ బ్రేస్, క్లియర్‌అలైనర్స్, తదితర చికిత్సలను 50 రాయితీపై అందిస్తున్నామని వివరించారు. వివరాలకు 73311 70047 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. నారాయణ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ కేవీ సునీల్‌కుమార్, ఆర్థోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ మండవ ప్రసాద్, డా.గౌరీశంకర్, డా.వివేక్‌రెడ్డి, ఏఓ అరవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులకు ఆపన్నహస్తం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇటీవల నగరంలోని బర్మాషెల్‌గుంట ప్రాంతంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్యూర్‌స్మైల్ సేవా సంస్థ చేయూతనందించింది. సంస్థ నిర్వాహకురాలు పర్వీన్ ఆధ్వర్యంలో బాధితులకు వంటపాత్రలు, బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులను శనివారం అందజేశారు. సంస్థ సభ్యులు నళిని, స్వర్ణ, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రజావైద్యులకు సన్మానం

నెల్లూరు(అర్బన్): ఆరోగ్యం అందరికీ అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్న పలువురు ప్రజావైద్యులను ప్రజారోగ్యవేదిక, డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సన్మానించనున్నట్లు ప్రజారోగ్యవేదిక జిల్లా అధ్యక్షుడు, డాక్టర్ రామచంద్రారెడ్డి ప్రజావైద్యశాల సూపరింటెండెంట్ రాజేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హరనాథపురంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సాయంత్రం 5.30 గంటలకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నెల్లూరు రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టీ లక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి, నెల్లూరు సర్వజన ఆస్పత్రిలోని డైస్ చిన్న పిల్లల విభాగం ఇన్‌చార్జి ఎంవీ సురేష్‌బాబు, కావలికి చెందిన విశ్రాంత సివిల్ సర్జన్ ఎన్ ప్రభాకర్‌నాయుడును సన్మానించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజారోగ్యవ్యవస్థ బలోపేతం, ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య హక్కు చట్టం –2024 అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు.





మహేశ్వరుడు సేవలు ఎనలేనివి



నెల్లూరు(సెంట్రల్): జిల్లా పశుసంవర్థక శాఖ అధికారిగా మహేశ్వరుడు అందించిన సేవలు ఎనలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఈ నెల 30న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా మహేశ్వరుడును ఆ శాఖ అధికారులు, సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సత్యవాణి, నాగేశ్వరరావు, డాక్టర్లు సోమయ్య, కోటేశ్వరరావు, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.